వైభవంగా వారాంతపు పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగుల రక్తదానం


ఐఎన్ఎస్ కళింగలో రక్తదానం చేస్తున్న నేవీ ఉద్యోగులు

తగరపువలస: తూర్పు తీర ప్రాంతంలోని ఐఎన్ఎస్ కళింగ - భీమిలిలో నేవీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలతో సహా 86 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. నగరానికి చెందిన ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదాతలకు అధికారులు సర్టిఫికెట్లు అందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

తగరపువలస: సంతపేట గొల్లవీధిలో ఆదివారం జరిగిన ప్రమాదంలో దుర్రి తేజ గాయపడ్డాడు. స్నేహితునితో కలిసి ద్విచక్ర వాహనంపై భీమిలి రోడ్డు నుంచి తాతా థియేటర్ వైపు వస్తుండగా ఆటోను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

ముగిసిన దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో మూడు రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆఖరి రోజు ఉదయం శిర్డీ సాయిబాబాకు పంచామృత, సుగంధ, ద్రవ్య, జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, హారతి అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, శంకర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ ప్రతినిధులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, పోతిన పైడిరాజు, దుర్గాశి సోంబాబు, మరుపిళ్లి ఆనంద్, బంక వాసు గ్రామ పెద్దలు సీస రామారావు తదితరులు పాల్గొన్నారు.


చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో సాయినాథునికి అభిషేకం చేస్తున్న భక్తులు

చెత్త తరలింపు వాహనాలు అడ్డగింపు

మధురవాడ: కొద్ది రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో వాహనాల ద్వారా చెత్త తరలించేందుకు అధికారులు ఆదివారం యత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. సీఐటీయూ నాయకులు, కార్మికులు వాహనాలకు ఎదురుగా పడుకుని అడ్డగిస్తున్నారు. జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం రోడ్డులో చెత్త తరలించే వాహనాలను సీఐటీయూ జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దీంతో 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వ్యక్తి గత పూచీకత్తుపై విడుదల చేశారు. ఎస్.రాములప్పడు, జి.కిరణ్, బి.నర్సింగరావు, బి.త్రినాథ్, చిన్న, ఆనంద్, పోతురాజు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఐక్యంగా మెలగాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ పెద్దలు

మధురవాడ: బ్రాహ్మణులు మరింత ఐకమత్యంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు తెలిపారు. మారికవలసలో మధురవాడ బ్రాహ్మణ సంక్షేమ సంఘం 8వ వార్షికోత్సవం, ఆత్మీయ కలయిక ఉత్సాహపూరిత వాతావరణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సామాజిక వర్గానికి చెందిన సమస్యల పరిష్కారానికి అంతా సమిష్టిగా కృషి చేయాల్సి ఉందని చెప్పారు. మధురవాడ ప్రాంత 5, 6, 7, 8 వార్డుల్లోని వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రేజేటి నరసింహమూర్తి, ఎ.కాళిదాసు, పి.హరిప్రసాద్, గురునాథ శర్మ, వేమకోటి అనంత పద్మనాభ శర్మ, శ్రీధరాచార్యులు, ఆర్.నరసింహాశర్మ, ఇతర కార్యవర్గ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు


ప్రమాద స్థలంలో నుజ్జయిన కారు

కొమ్మాది: బీచ్‌రోడ్డు రాడిసన్‌బ్లూ హోటల్ వద్ద ఆదివారం తెల్లవారుజామున భీమిలి నుంచి వైజాగ్ వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఎయిర్ బెలూన్స్ సమయానికి తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాద స్థలంలో ఎవరూ లేకపోవడంతో అపాయం కలగలేదు. కారు బలంగా చెట్టును ఢీకొట్టడంతో ఆ చెట్టు వేర్లతో సహా బయటకు వచ్చింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. నాలుగు నెలల క్రితం ఈ ప్రాంతంలో జరిగిన ఓ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ


హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస: గత ఏడాది అక్టోబర్‌లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ - చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రవేశిక నుంచి రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ వరకు 20 మందికి వీటిని అందించారు. భీమిలి ఎస్‌వోపీఎస్‌కు చెందిన మరో 50 మందికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉందని మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా సూకరాజు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ఏనుగులపాలెంలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

ఆనందపురం: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ప్రతినిధులు ఆదివారం మండలంలోని ఏనుగుల పాలెం, గొట్టిపల్లి కళ్లాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రబోధానంద రచించిన సిద్ధాంత గ్రంథంపై వివరించారు. కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, ఎస్.శ్రీనివాస్, వి.భవానీ, కె.లక్ష్మి, కె.రాజు, బి.రమాదేవి, కె.బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

శరణ్య వేంకటేశ్వరునికి పూజలు


గంభీరంలోని శరణ్య వేంకటేశ్వరస్వామి

ఆనందపురం: మండలంలోని గంభీరం శరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం రాత్రి 12 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. అలాగే సోమవారం ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు శ్రీవారి వజ్ర కవచ దర్శనం కల్పించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎంపీ కృష్ణయ్య దృష్టికి నాగవంశీయుల సమస్యలు

తగరపువలస: నాగవంశీయుల సమస్యలను రాజ్యసభలో ప్రస్తావించాలని కోరుతూ ఎంపీ ఆర్.కృష్ణయ్యకు రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు ఆదివారం వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కృష్ణయ్యను కలిసిన ఆయన నాగవంశీయుల సమస్యలపై మాట్లాడారు. బీసీ డీ జాబితా నుంచి బీసీ ఏకు మార్చడం, ప్రధాన నగరాల్లో విద్యార్థుల కోసం వసతి గృహాల నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరారు. బీసీల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషిపై చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ నాగవంశీయుల సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి పార్లమెంట్‌లో లేవనెత్తుతానని హామీ ఇచ్చినట్టు తెలిపారన్నారు. కృష్ణయ్యను జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జు సత్యం, తదితరులు కలిశారు.

భగవద్గీత పఠన, క్విజ్ పోటీలకు ఆహ్వానం

తగరపువలస: గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక గీతా ప్రచార సంఘం ఈ నెల 7న మోక్ష సన్యాస యోగంపై పెద్దలకు, విద్యార్థులకు కంఠస్థ పఠన పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. గీతా ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు అదేరోజు ఉదయం 8 గంటలకు పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ప్రథమ వర్గంలో 5 నుంచి 10 ఏళ్ల వయసు కలిగిన వారు 1 నుంచి 15 శ్లోకాలు, ద్వితీయ వర్గంలో 11 నుంచి 14 ఏళ్ల వయసు వారు 1 నుంచి 30 శ్లోకాలు, తృతీయ వర్గంలో 15 ఏళ్ల పైబడిన వారు 30 శ్లోకాలతోపాటు మూడు శ్లోకాల భావాలు వివరించాల్సి ఉంటుంది. అలాగే ఈ నెల 10న మధ్యాహ్నం నారాయణసేవ నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు భగవద్గీత పఠన పోటీల విజేతలకు బహుమతులు అందించనున్నారు.